## క్లుప్తంగా

### సీఎం సహాయ నిధి చెక్కు అందజేత



లబ్ధిదారులకు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే ఎలీజా

**చింతలపూడి:** ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన చేస్తున్నారని ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. వైఎస్సార్ సీపీ స్థానిక కార్యాలయంలో శుక్రవారం సీఎం సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే అందజేశారు. పేదల ఆరోగ్యం విషయంలో సీఎం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారని చెప్పారు. ప్రతి నియోజకవర్గానికీ 100 పడకల ఆసుపత్రి, ప్రతి జిల్లాకూ మెడికల్ కళాశాల ఏర్పాటు, ఆరోగ్యశ్రీ ద్వారా కోట్లాది మందికి ఆరోగ్య రక్ష కల్పిస్తున్నారని వివరించారు. ఏఎంసీ మాజీ చైర్మన్ మందలపు సాయిబాబు, మండల సచివాలయాల కన్వీనర్ త్సల్లాబత్తుల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

### వసతి గృహంలో తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న విజయకృష్ణ

**కామవరపుకోట:** స్థానిక బీసీ బాలుర వసతి గృహాన్ని జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యుడు వంటిపల్లి విజయకృష్ణ శుక్రవారం తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు, ఆహార ధాన్యాల నిల్వల రిజిస్టర్లను పరిశీలించారు. భోజనం రుచి, నాణ్యత, పరిమాణం, మెనూ అమలు, మంచినీటి సదుపాయం తదితర వివరాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. దాతలు విద్యార్థుల పట్ల కనపరుస్తున్న చొరవ, స్పందిస్తున్న తీరు ప్రశంసనీయమన్నారు. వసతి గృహం శుభ్రత విషయంలో శ్రద్ధ వహించాలని సిబ్బందికి సూచించారు.

### పాఠశాలల్లో డీఈఓ తనిఖీలు



విద్యార్థిని నైపుణ్యాన్ని పరిశీలిస్తున్న డీఈఓ

**ద్వారకాతిరుమల:** మండలంలోని గుణ్ణంపల్లి జెడ్పీ ఓరియంటల్ ఉన్నత పాఠశాల, భవిత పాఠశాలను జిల్లా విద్యాశాఖాధికారి పి.శ్యాం సుందర్ శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. జెడ్పీ పాఠశాలలోని ఆరో తరగతి విద్యార్థుల్లో హిందీ, ఇంగ్లిష్ పఠనా నైపుణ్యాలను, గణితంలో అభ్యసన నైపుణ్యాలను స్వయంగా పరిశీలించారు. తొమ్మిదో తరగతి ఎస్‌ఏ-1 పరీక్షను పరిశీలించారు. భవిత పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాలలో చేపట్టిన నాడు - నేడు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.

### మహిళలపై హింస మానవ మనుగడకు అవరోధం

**ద్వారకాతిరుమల:** మహిళలపై హింసను అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని సచివాలయాల శాఖ ఎస్పీసీసీ కోఆర్డినేటర్ టీఎస్ స్నేహన్ అన్నారు. మహిళలపై హింసను వ్యతిరేకిస్తూ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో చేపట్టిన ఉద్యమంలో భాగంగా శుక్రవారం ద్వారకాతిరుమల మండలం గుళ్లపాడు గ్రామంలో ఏర్పాటుచేసిన ప్రత్యేక కార్యక్రమంలో స్నేహన్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మహిళలపై హింస మానవ మనుగడకే అవరోధమన్నారు. దేశ వ్యాప్తంగా సగటున గంటకు 49 మంది మహిళపై నేరాలు జరుగుతున్నట్టు గణాంకాలు చెబుతున్నాయని, మత గ్రంథాలు సైతం మహిళలకు ప్రాధాన్యత ఇస్తున్నాయని చెప్పారు. మహిళపై హింస లేకుండా చేయటానికి 1979లో ఐక్యరాజ్య సమితి తీర్మానం చేసిందని, ఈ మేరకు వివక్షకు వ్యతిరేకంగా మహిళలకు సమర్థవంతమైన రక్షణ కల్పించేందుకు ప్రభుత్వాలు కృషి చేయాలని అన్నారు. ఇందులో భాగంగా నవంబర్ 25 నుంచి డిసెంబర్ 22 వరకు దేశ వ్యాప్తంగా ఈ ప్రచారోద్యమం చేపట్టామన్నారు. మహిళలు తమపై జరిగే హింసను ఎలా ఎదుర్కొనాలో తెలిపారు. తొలుత మహిళల చేత ప్రతిజ్ఞ చేయించారు. సీఏలు కె.సుజాత, ఎం.జాన్సీ, యు.భవాని తదితరులున్నారు.

### చీటింగ్ కేసు నమోదు

**పోలవరం రూరల్:** నమ్మించి మోసం చేసిన నేరంలో వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్ తెలిపారు. పోలవరం మండలం గూటాలకు చెందిన పలకం శెట్టి రాంబాబు వ్యవసాయం చేసి జీవనం సాగిస్తాడన్నారు. 2021వ సంవత్సరంలో నామా అన్నవరం అనే ధాన్యం కమీషన్ వ్యాపారి చెప్పడంతో రాంబాబు రూ.3.24 లక్షలు విలువ చేసే ధాన్యం అనపర్తికి చెందిన కోణాల ఆనందరెడ్డికి అమ్మాడని తెలిపారు. సొమ్ము సకాలంలో ఇవ్వకపోవడంతో పలు సార్లు ఆనందరెడ్డిని రాంబాబు అడగ్గా, రూ.2.60 లక్షల చెక్కు ఇచ్చాడన్నారు. ఆ చెక్కు చెల్లకపోవడంతో, 2022లో జంగారెడ్డిగూడెం కోర్టులో రాంబాబు వేసిన కేసు విచారణలో ఉందని చెప్పారు. ఆనందరెడ్డిని పరిచయం చేసిన అన్నవరంపైనా చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని రాంబాబు కోరగా కేసు దర్యాప్తు చేపట్టినట్టు ఎస్సై తెలిపారు.

# గ్రామాల అభివృద్ధికి జగనన్నే కావాలి

ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

**బుట్టాయగూడెం:** గ్రామాలు పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందాలంటే వచ్చే ఎన్నికల్లో మరోసారి జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. బుట్టాయగూడెం మండలం దొరమామిడిలో వై ఏపీ నీడ్స్ జగన్, పల్లెకు పోదాం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. గ్రామంలోని వైఎస్సార్ విగ్రహం వద్ద పార్టీ జెండాను ఆయన ఎగురవేశారు. సచివాలయం వద్ద సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజల వద్దకెళ్లి ఓటు అడిగే హక్కు ఒక్క వైఎస్సార్‌సీపీకే ఉందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మొడియం రామతులసి, ఎంపీపీ కారం శాంతి, వైస్ ఎంపీపీ గగ్గులోతు మోహన్‌రావు, పార్టీ సీనియర్ నాయకులు అల్లూరి రత్నాజీరావు, ఆరేటి సత్యనారాయణ, సర్పంచ్ తెల్లం రాముడు, ఎంపీడీఓ వేణు గోపాల్‌రెడ్డి, పార్టీ నాయకులు కాళింగి వెంకటేశ్వరరావు, కణితి దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

**పథకాల అమలుపై ఆరా**

**పోలవరం రూరల్:** పోలవరం మండలం వింజరం పంచాయతీ వద్ద వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ జెండాను పార్టీ మండల కన్వీనర్ బుగ్గా మురళీకృష్ణ ఎగురవేశారు. సంక్షేమ బోర్డును ఆవిష్కరించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలకు పథకాలను వివరించారు. రాబోయే ఎన్నికల్లో జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, జెడ్పీటీసీ కలుం హేమకుమారి, సర్పంచ్ కొక్కెర వెంకటలక్ష్మి, ఎంపీటీసీ కుంజం చిట్టెమ్మ, కోఆప్షన్ మెంబర్ ఎస్కే ఖాన్, ఎంపీడీఓ జి.శ్రీను, పార్టీ నాయకులు కలుం నాగమణి, పిల్లంగోరు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

**ప్రజా సంక్షేమమే లక్ష్యం**

**టి.నరసాపురం:** ప్రతి ఒక్కరూ సంతోషంగా ఉండాలనే లక్ష్యంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పథకాలను అత్యంత పారదర్శకంగా అమలు చేస్తున్నారని వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు శ్రీనురాజు అన్నారు. టి.నరసాపురం మండలం తిరుమలదేవిపేటలో శుక్రవారం వై ఏపీ నీడ్స్ జగన్, పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వ పాలన, పథకాలు అమలు, రాష్ట్రానికి జగన్ ఎందుకు అవసరమో ప్రజలకు వివరించారు. గ్రామంలో అమలైన పథకాల లబ్ధిని తెలిపే ఫ్లెక్సీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో యర్రా గంగాధరరావు, దాకారపు సూరిబాబు, దాసరి రాంబాబు, సూరిబాబు, రామారావు, తదితరులు పాల్గొన్నారు.



బుట్టాయగూడెం: దొరమామిడిలో సంక్షేమ బోర్డు ప్రారంభం



జంగారెడ్డిగూడెం రూరల్: తాడువాయిలో జెండా ఆవిష్కరణ



చింతలపూడి: సీతానగరంలో జెండా ఆవిష్కరిస్తున్న పార్టీ శ్రేణులు



టి.నరసాపురం: తిరుమలదేవిపేటలో పథకాల బ్రోచర్ అందిస్తున్న నాయకులు



పోలవరం రూరల్: వింజరంలో వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు



లింగపాలెం: మఠంగూడెంలో సంక్షేమ బోర్డును ప్రారంభిస్తున్న నాయకులు



ద్వారకాతిరుమల : పంగిడిగూడెంలోని కరపత్రం అందిస్తున్న నాయకులు

**సీతానగరం సచివాలయంలో రూ.25 కోట్ల లబ్ధి**

**చింతలపూడి:** మండలంలోని సీతానగరం సచివాలయంలో శుక్రవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. పార్టీ జెండాను ఆవిష్కరించి, సంక్షేమ బోర్డును ఆవిష్కరించారు. సచివాలయం పరిధిలో ప్రజలకు రూ.25 కోట్ల లబ్ధి చేకూరిందని సర్పంచ్ గాయం మల్లేశ్వరి అన్నారు. మండల పరిషత్ చీఫ్ విప్ కలకొండ రాంబాబు మాట్లాడుతూ పథకాలు పొందని ఇల్లు ఒక్కటి కూడా లేదన్నారు. మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంగా గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల సచివాలయాల కన్వీనర్ త్సల్లా బత్తుల శ్రీనివాసరావు, ఈవోపీఆర్డీ విక్టర్ బాబు, యండపల్లి సర్పంచ్ యడ్ల మోహన్‌రావు, తమ్మిశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

**తాడువాయిలో వై ఏపీ నీడ్స్ జగన్**

**జంగారెడ్డిగూడెం రూరల్:** మండలంలోని తాడువాయి గ్రామంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ జెండానును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తూ పేదల ప్రజల జీవితాల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వెలుగులు నింపుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ యరమాల సత్యవతి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు వామిశెట్టి హరిబాబు, ఎంపీటీసీ పొడపాటి నందిని, వైఎస్సార్‌సీపీ నాయకులు కనికళ్ల ప్రసాద్‌బాబు, వీరెంకి సత్యనారాయణ, గంజి వినోద్, సత్రం వెంకట్రావు, చీదిరాల నాగేశ్వరరావు, ఇర్ల శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**జగన్‌తోనే పథకాల అమలు**

**లింగపాలెం:** సంక్షేమ పథకాలు పారదర్శకంగా పేద ప్రజలకు చేరాలంటే మళ్లీ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి రావాలని వైస్ ఎంపీపీ మట్టా సురేష్ అన్నారు. మఠంగూడెం గ్రామంలో శుక్రవారం ఏఎంసీ మాజీ చైర్మన్ మందలపు సాయిబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. పార్టీ జెండాను ఎగురవేశారు. ప్రజలకు వారు పొందిన పథకాల లబ్ధిని వివరించారు. కార్యక్రమంలో పార్టీ మండల ముఖ్యనేత ముసునూరి వెంకటేశ్వరరావు, మండల సచివాలయ కన్వీనర్ అన్నపనేని శాంతారావు, ఎంపీడీఓ ఆశీర్వాదం, ఈవోపీఆర్డీ రత్నకుమార్, కార్యదర్శి ప్రవీణ్, పార్టీ నాయకులు రాంబాబు, సీహెచ్ ప్రసాద్, ఎన్ ఏడుకొండలు, తదితరులు పాల్గొన్నారు.

**జగన్‌తోనే పథకాల అమలు**

**ద్వారకాతిరుమల:** సంక్షేమ పథకాలు అమలు కావాలంటే మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కావాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు అన్నారు. ద్వారకాతిరుమల మండలం పంగిడిగూడెంలో శుక్రవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి పథకాల అమలును వివరించారు. జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, సర్పంచ్ ప్రత్తిపాటి యోహాను, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ బాషా, జేసీఎస్ కన్వీనర్ భోగరాజు సాయికృష్ణ, గుమ్మడి శ్రీను, బోరుగడ్డ రాజారావు, చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

# పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

**బుట్టాయగూడెం:** పేదల సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. బుట్టాయగూడెం మండలం దొరమామిడి సమీపంలోని సరుగుడు, తెల్లదిబ్బలు నిర్వాసిత గ్రామాల్లో శుక్రవారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలరాజు మాట్లాడుతూ అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింపజేయడమే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ పనిచేస్తున్నట్టు చెప్పారు. కరోనా కష్టకాలంలో సైతం ప్రజలకు సంక్షేమ పథకాలను అందించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఇచ్చిన హామీల్లో 99 శాతం నెరవేర్చారని వివరించారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ సీఎంగా జగన్‌నే ప్రజలు గెలిపించాలని కోరారు. నిర్వాసితుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. జెడ్పీటీసీ మొడియం రామతులసి, ఎంపీపీ కారం శాంతి, వైస్ ఎంపీపీ గగ్గులోతు మోహన్‌రావు, పార్టీ సీనియర్ నాయకులు అల్లూరి రత్నాజీరావు, ఆరేటి సత్యనారాయణ, సర్పంచ్ తెల్లం రాముడు, ఎంపీడీఓ వేణు గోపాల్‌రెడ్డి, పార్టీ నాయకులు కాళింగి వెంకటేశ్వరరావు, కణితి దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.



తెల్లదిబ్బలులో నిర్వాసితుల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బాలరాజు

# ధాన్యాన్ని భద్రపర్చుకోవాలి

**జంగారెడ్డిగూడెం రూరల్:** రానున్న 3, 4 రోజుల్లో తుఫాన్ ప్రభావంపై వస్తున్న హెచ్చరికలపై రైతులు అప్రమత్తంగా ఉండాలని, ధాన్యాన్ని భద్రపర్చుకోవాలని మండల వ్యవసాయాధికారి పోశారావు సూచించారు. జంగారెడ్డిగూడెం మండలం లక్కవరంలో రైతు భరోసా కేంద్రంలో రైతులతో ఏవో పోశారావు సమావేశమయ్యారు. అనంతరం కళ్లాల్లో ఉన్న ధాన్యాన్ని పరిశీలించారు. సార్వా సీజన్‌లో జంగారెడ్డిగూడెం మండలంలో 11,410 ఎకరాల్లో రైతులు వరిసాగు చేపట్టారని, ఇప్పటి వరకు 5,000 వేల ఎకరాల్లో కోతలు పూర్తయ్యాయని చెప్పారు. ఆర్బీకేల ద్వారా ధాన్యం కొనుగోలు చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ గెల్లా వెంకటరమణ, ఉప సర్పంచ్ నిమ్మ రామకృష్ణ, సొసైటీ ప్రెసిడెంట్ బడి దుర్గారావు, దల్లి నాగేశ్వరావు, నిమ్మ గురునాథరెడ్డి, చిల్ల దుర్గారెడ్డి పాల్గొన్నారు.

**పంట కోతలను వాయిదా వేసుకోవాలి**

**ద్వారకాతిరుమల:** తుఫాన్ దృష్ట్యా పంట కోతలను నాలుగైదు రోజుల పాటు వాయిదా వేయాలని మండల వ్యవసాయశాఖ అధికారి ఎ.దుర్గా రమేష్ సూచించారు. ద్వారకాతిరుమల మండలంలో 4,200 ఎకరాలకు, ఇప్పటికే 1,500 ఎకరాల్లో వరి కోతలు పూర్తయ్యాయన్నారు. మిగిలిన 2,700 ఎకరాల పంట కోతలను రైతులు వాయిదా వేసుకోవాలని సూచించారు.



లక్కవరంలో కళ్లాల్లో ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఏఓ పోశారావు

### నేడు, రేపు ఓటర్ల నమోదు

**చింతలపూడి:** చింతలపూడి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఫొటో ఎలక్టోరల్ రోల్స్ ప్రత్యేక సారంశ సవరణకు ఈ నెల 2, 3 తేదీల్లో స్పెషల్ క్యాంపైన్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ కృష్ణ జ్యోతి తెలిపారు. పోలింగ్ బూత్ వద్ద అధికారులు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొత్తగా ఓటు నమోదు, తొలగింపు, మార్పులు చేర్పులకు ఫారం -6, -7, -8 తీసుకొంటారని పేర్కొన్నారు. ఓటర్లందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

### గృహ నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

**టి.నరసాపురం:** గృహ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని తహసీల్దార్ జేవీ సుబ్బారావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నవ రత్నాలు పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మెగా కంప్లీషన్ మేళా నిర్వహించారు. మండలంలో 2135 ఇళ్లు మంజూరు కాగా 664 ఇళ్ల నిర్మాణం పూర్తి కావాల్సి ఉందని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మంగా కుమారి, హౌసింగ్ ఏఈర్ జి.రాధాకృష్ణ, ఏపీఓ శ్రీనివాస్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

### 4న భూ పోరాట సదస్సు

**టి.నరసాపురం:** కామవరపుకోటలో ఈ నెల 4న నిర్వహించే భూ పోరాట సదస్సును విజయవంతం చేయాలని ఏఐటీయూసీ చింతలపూడి ఏరియా గౌరవ అధ్యక్షుడు టీవీఎస్ రాజు పిలుపు నిచ్చారు. శుక్రవారం మండలంలోని బొర్రంపాలెం, మక్కినవారిగూడెం, మద్యాహ్నపువారిగూడెం, అప్పలరాజుగూడెం, బండివారిగూడెం, టి.నరసాపురం గ్రామాల్లో పర్యటించి సదస్సు కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కొండముచ్చు శ్రీనివాసరావు, కాళహస్తి సుబ్బారావు, మక్కిన పుల్లారావు, వల్లెం వెంకటేశ్వరరావు, కొప్పుల సతీష్, బయ్యగాని ఏకాంబరం తదితరులు పాల్గొన్నారు.

### వ్యక్తి అరెస్ట్

**జంగారెడ్డిగూడెం:** మద్యం అమ్ముతున్న వ్యక్తిని అరెస్టు చేసినట్టు హెచ్‌సీ సీహెచ్ కోటేశ్వరరావు తెలిపారు. వేగవరం గ్రామంలో హోటల్ వద్ద అదే గ్రామానికి చెందిన పి.నారాయణ అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా అరెస్ట్ చేసి, ఆరు మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

### వైభవంగా ఉదయాస్తమాన సేవలు



పారిజాతగిరిలో శ్రీనివాసుడికి పూజ చేస్తున్న అర్చకులు

**జంగారెడ్డిగూడెం:** గోకుల తిరుమల పారిజాత గిరి వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో కార్తీక మాసం మూడో శుక్రవారం సందర్భంగా స్వామివారికి ఉదయాస్తమాన సేవలు ప్రధాన అర్చకులు నల్లూరు రవికుమార్ ఆచార్యులు ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఏర్పాట్లను కార్యనిర్వహణ అధికారి మానికల రాంబాబు పర్యవేక్షించారు. ముత్యాలమ్మ ఆలయంలో ఆలయ నిర్మాణకర్త బవిరిశెట్టి మురళీ కృష్ణ, పద్మ కుమారి దంపతులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు.

**వెండి సమర్పణ**

నూకాలమ్మ ఆలయంలో శుక్రవారం పూజలు చేశారు. అమ్మవారి రజత వస్త్రానికి పోలుకొండ లలితకుమారి కుటుంబ సభ్యులు 10 తులాల వెండిని, పరిమి వెంకట్రావు, శ్రీలక్ష్మి దంపతులు (చల్లవారి గూడెం) ఒక గ్రాము బంగారం, నల్లూరి సత్యనారాయణ, మాధవి దంపతులు 5 తులాల వెండిని సమర్పించారని ఆలయ చైర్మన్ రాజాన తెలిపారు.

# ఎయిడ్స్‌ని తరిమి కొడదాం

**చింతలపూడి:** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో శుక్రవారం ఎయిడ్స్ నిర్మూలనపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కళాశాల నుంచి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఏలూరు - చింతలపూడి ప్రధాన రహదారిపై మానవహారంగా ఏర్పడ్డారు. ప్రిన్సిపాల్ పి.శ్రీనివాసరావు ఎయిడ్స్ నివారణపై అవగాహన కలిగించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో ఏలూరు స్మార్ట్ సిటీ లైయన్స్ క్లబ్, వసుంధరా వాలంటరీ బ్లడ్ బ్యాంక్ ,ట్రీస్ ఇండియ స్వచ్ఛంద సంస్థలు ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపాల్ సైకలాబ్, శ్రీనివాస్, డిడ్ల ఆంజిలో, తాతపూడి అబ్రహం లింకన్, ఎస్‌కేఎస్‌వీ ప్రసాద్, బర్మా శశి, వి.వర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. వైద్య ఆరోగ్య శాఖ, ప్రగడవరం లయన్స్ క్లబ్‌ల ఆధ్వర్యంలో జెడ్పీ హైస్కూల్ ఆవరణలో ఎయిడ్స్ నిర్మూలనపై అవగాహన కల్పించారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ భరత్ కుమార్ మాట్లాడారు. హెచ్ఎం విమలాదేవి, లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు అమృతవల్లి, కార్యదర్శి రాజేశ్వరి, ఉపాధ్యాయులు వేమారెడ్డి, సంజయ్ పాల్గొన్నారు.

**ఎయిడ్స్ రహిత సమాజంతోనే అభివృద్ధి**

**కొయ్యలగూడెం:** ఎయిడ్స్ రహిత సమాజంతోనే ప్రపంచ అభివృద్ధి సాధ్యమని ప్రభుత్వ వైద్యాధికారి వి.సత్యనారాయణ పేర్కొన్నారు. బయ్యనగూడెం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఎయిడ్స్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ ఎం.గీతారాణి, హెచ్ఈఓ ఎల్ సుబ్రహ్మణ్యం, వైద్య ఆరోగ్య సిబ్బంది ఆశా కార్యకర్తలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

**ఎయిడ్స్‌పై అవగాహన**

**కామవరపుకోట:** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్, రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం నిర్వహించారు. ఆడమిల్లి గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎం.మల్లేశ్వర రావు, ఎన్ఎస్ఎస్ విభాగం కోఆర్డినేటర్ డాక్టర్ జి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎయిడ్స్ లక్షణాలు, నివారణపై మాట్లాడారు. అధ్యాపకులు జి.శ్రీనివాసరావు, జి.రామ్మోహన్, వి.శ్రీనివాస్, ధారావతు మల్లేష్, బి.రాజు, ఎం.ఉషారాణి పాల్గొన్నారు.

**ఎయిడ్స్ నివారణ దినోత్సవం**

**జంగారెడ్డిగూడెం:** స్థానిక దామోదర సంజీవయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అంతర్జాతీయ ఎయిడ్స్ నివారణ దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపాల్ బోడపాటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఎయిడ్స్ వల్ల కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరించారు. అనంతరం కళాశాల నుంచి ప్రభుత్వ ఆసుపత్రి వరకు ర్యాలీ నిర్వహించారు. సూపరింటెండెంట్ బేబీ కమల, ఆసుపత్రి టీబీ సూపర్‌వైజర్ ఈ.అంబేద్కర్, మెడికల్ సిబ్బంది, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.




చింతలపూడి : విద్యార్థుల మానవహారం



జంగారెడ్డిగూడెం: అవగాహన ర్యాలీ

# కోర్టు ఆదేశాలతో భూవివాదం పరిష్కారం

**కొయ్యలగూడెం:** వంకాబొత్తప్పగూడెం సమీపంలోని గిరిజన, గిరిజనేతరులకు మధ్య ఏర్పడిన భూవివాదాన్ని కోర్టు ఆదేశాల మేరకు పోలీసులు పరిష్కరించారు. శుక్రవారం గ్రామ సమీపంలోని వివాదాస్పద వ్యవసాయ భూముల వద్ద సీఐ విజయబాబు, ఎస్సై జీజే విష్ణువర్ధన్ గిరిజనులతో చర్చించారు. దిప్పకాయలపాడుకు చెందిన కలగర శేషరత్నం, కలగర కుమారస్వామి, బొట్టా చంద్రం, బోట్ల పద్మ, గద్దె సుభశ్రీ, అట్లూరి ఇంద్రకుమారి తదితర 15 మంది రైతులు హైకోర్టు నుంచి 43 ఎకరాల వివాదాస్పద భూములు తమకు చెందినవిగా తీర్పు పొందారని తెలిపారు. ఈ మేరకు తమకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారన్నారు. కోర్టు ఆదేశాల మేరకు భూములు వారికి అప్పగించాలని గిరిజనులకు సూచించారు. దీంతో గిరిజనలు అక్కడ నుంచి వెళ్లిపోవడంతో గిరిజనేతర రైతులు తమ వ్యవసాయ భూముల్లో పనులను ప్రారంభించారు.



వంకా బొత్తప్పగూడెంలో గిరిజనులతో చర్చిస్తున్న సీఐ, ఎస్సై

# రేపు బ్రాహ్మణ పరిషత్ వనసమారాధన

**జంగారెడ్డిగూడెం:** జంగారెడ్డిగూడెం ప్రాంతీయ బ్రాహ్మణ పరిషత్ ఆధ్వర్యంలో కార్తీక వనసమారాధన ఈ నెల 3న నిర్వహించనున్నట్టు ప్రాంతీయ బ్రాహ్మణ పరిషత్ గౌరవ అధ్యక్షుడు మల్లాది సీతారామారావు, అధ్యక్షుడు శ్రీచిలుకూరి సాయిబాబు తెలిపారు. కార్యదర్శి కూచిభట్ల రాము పర్యవేక్షణలో ఏలూరు రోడ్డులోని షిర్డీ సాయిబాబా స్తూపం వద్ద పర్వతం తులసీరావు మామిడి తోటలో వన సమారాధన ఏర్పాటుచేశామన్నారు. బ్రాహ్మణులంతా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతంచేయాలని కోరారు.

### ఉపాధ్యాయుడు ఊటుకూరికి సన్మానం



పోలవరం హై స్కూల్లో ఊటుకూరిని సన్మానిస్తున్న దృశ్యం

**పోలవరం/కొయ్యలగూడెం:** కవి, రచయితగా తెలుగు భాష ఔన్నత్యానికి చేసిన కృషి, పలు దేశాల్లో తెలుగు ఔన్నత్యానికి పాటుపడిన కొయ్యలగూడెం మండలం బోడిగూడెం జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయుడు ఊటుకూరి వరప్రసాద్ పలువురు ప్రముఖుల నుంచి సత్కారం అందుకున్నారు. పోలవరం గవర్నమెంట్ హైస్కూల్లో శుక్రవారం నిర్వహించిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో ఆయన్ని సత్కరించారు. పాఠ్య పుస్తక రచయితగా, అమెరికా, సింగపూర్ మలేషియా మారిషస్ దేశాల్లో వరప్రసాద్ పర్యటించారు. మాబడి, పాఠశాల ఆన్‌లైన్‌లో ఆరు సెమిస్టర్ల కోసం తెలుగు పాఠాలు తయారుచేశారని ఎంఈఓ చూడామణి తెలిపారు. సర్వశిక్ష అభియాన్ ద్వారా హైస్కూల్ స్థాయిలో టీచింగ్ మెటీరియల్ తయారీకి పుస్తకాన్ని రూపొందించారని, ఇటీవల తయారైన తొమ్మిదో తరగతి పాఠ్య పుస్తకంలో కూడా ప్రధాన భూమిక పోషించారని వివరించారు. మహాకవి గుర్రం జాషువ పురస్కారం, క్రైస్తవ సాహిత్య అకాడమీ అందించిన వచనారచన సామ్రాట్ పురస్కారం వరప్రసాద్‌కు లభించాయని తెలిపారు. ఉపాధ్యాయులు ఆర్‌పీ తులసి ప్రసాద్, చింతపల్లి సత్యనారాయణ, రాంబాబు, బలరాం, సత్యనారాయణమూర్తి, నాగకృష్ణ, ఏసురత్నం తదితరులు పాల్గొన్నారు.